www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 ఆగస్టు 2025



చికిత్స పొందుతూ రైతు మృతి

ప్రజాశక్తి-గాలివీడు: అప్పులబాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రైతు నర్రీ శంకర్(45) పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని పెద్దరెడ్డివారిపల్లికి చెందిన శంకర్ గుడిసెలోపల్లికి చెందిన రైతు బండెరు చిన్నరెడ్డి పొలాన్ని కౌలుకు తీసుకొని వరి, టమోటా పంటలను సాగు చేసి నష్టపోయాడన్నారు. అనంతరం ఆవులు, గేదెలు కొనుక్కొని వాటిని మేపు కుంటూ జీవనం సాగించేవాడని తెలిపారు. వాటిని అమ్మే సరికి నష్ట వాటిల్లిందన్నారు. వ్యవసాయం, పాడిపరిశ్రమ కోసం రూ.8లక్షల వరకు అప్పులు చేశాడని, అప్పుల బాధ ఎక్కువ కావడంతో మానసిక్షానికి గురై బుధవారం రాత్రి గన్నేరు పప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కొరకు కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న యజమాని మృతి చెందడంతో ఆకుటుంబం అనాథగా మారింది. నలుగురు ఆడపిల్లలు పోషించుకోవాలని మృతి భార్య కన్నీటి పర్యంతమైంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గోకులం..కావాలి ఊతం

- షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు
- బిల్లుల కోసం ఎదురుచూపులు
- ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-రాయచోటి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద నిర్మించిన గోకులం షెడ్లకు బిల్లులు రాకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులు గోకులం షెడ్లు నిర్మించుకోవాలని ఆశ ఉన్నా... బిల్లులు వచ్చే పరిస్థితి కనపడలేదని నిరుస్తాహంతో ఉన్నారు. పశు పోషకులు గోకులం షెడ్లు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలో నిర్మాణ పనులు వదిలేయలేక డబ్బులు అప్పు తెచ్చుకొని గోకులం షెడ్లు నిర్మించుకుంటే బిల్లు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి అంటున్నారు. మరి కొంతమంది గోకులం షెడ్ల నిర్మాణ పనులు అసలు ప్రారంభించలేదు. గత వైసిపి ప్రభుత్వం గోకులం షెడ్ల పథకానికి మంగళం పాడింది. కూటమి ప్రభుత్వం వచ్చిందని, ఆసక్తి ఉన్న పాడి రైతులకు గోకులం షెడ్లు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఫారం షెడ్లు మంజూరయ్యాయని రైతులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. రైతులు తమ వంతుగా 10 శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన యూనిట్ మొత్తాన్ని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఐదు నెలల నుంచి బిల్లులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే డబ్బులు వస్తాయని నమ్మకంతో అప్పులు తెచ్చుకుని మరి షెడ్లు నిర్మించారు. ఇప్పుడు బిల్లుల కోసం ఉపాధి కార్యాలయం చుట్టూ రైతులు తిరిగి తిరిగి అలచిపోతున్నారు. బిల్లులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం.

మండలాల వారీగా గోకులాలు..

జిల్లాకు 1306 మినీ గోకులాలు మంజూరు కాగా 1175 పూర్తయ్యాయి. మండలాల వారీగా గోకులాలను పరిశీలిస్తే...బి.కొత్తకోట మండలానికి 51 మినీ గోకులాలు మంజూరు కాగా 50 పూర్తయ్యాయి. చిన్నమండెంలో 70కి 62, చిట్వేల్‌లో 41కి 26, గాలివీడులో 56కు 52, గుర్రంకొండలో 59కి 57, కలకడలో 65కి 64, కలికిరిలో 26కి 26, కంభంవారిపల్లిలో 72కు 45, రైల్వేకోడూరులో 34కి 24, కురబలకోటలో 50కి 50, లక్కిరెడ్డిపల్లిలో 55కు 52, మదనపల్లిలో 25కి 25, ములకలచెరువులో 27కు 25, నందలూరులో 36కి 29, నిమ్మనపల్లిలో 25కి 24, ఓబులవారిపల్లెలో 25కి 22, పెద్దతిప్పసముద్రంలో 48కి 45, పెనగలూరులో 48కి 48, పుల్లంపేటలో 22కి 22, రాజంపేటలో 36కి 28, రామాపురంలో 73కి 68, రామసముద్రంలో 29కి 29 రాయిచోటిలో 64కి 56, సంబేపల్లిలో 33కి 31, తంబళ్లపల్లెలో 51కి 45, వాల్మీకిపురంలో 24కి 23, వీరబల్లి మండలంలో 44 గురుకులాలకు 41 పూర్తయ్యాయి.



పీలేరు మండలంలోని బందారివారిపల్లెలో పూర్తయిన మినీ గోకులం

బిల్లుల కోసం ఎదురుచూస్తున్నా

కూటమి ప్రభుత్వంలో గోకులం షెడ్డు మంజూరైదని బంగారు నగలు, బ్యాంకులో పెట్టి డబ్బులు తెచ్చి గోకులం షెడ్డు పూర్తి చేశాను. మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా. బిల్లు వస్తే నగులు విడిపించుకుందాం అనుకున్నా... బిల్లు రాకపోవడంతో ఎంత తెలుసుకుని వాడివి వడ్డీలు ఎక్కువైపోతున్నాయి. వర్షాలు కురవక నాలుగేళ్లుగా మామిడి, వరి, వేరుశనగ, ఇతర పంటలు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. జీవనం సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు రైతుల గురించి ఆలోచించి గోకులం షెడ్డు బిల్లులు మంజూరు చేయాలి.



- రేపన రామచంద్ర, రైతు, రాయచోటి.

ఆందోళనవసరం లేదు

గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల బిల్లులకు సంబంధించిన వివరాలు ఉన్నతాధికారులకు ప్రతిపాదనల పంపాం. నిధులు మంజూరు కాకపోవడంతో బిల్లును చెల్లించలేకపోయాం. త్వరలో బిల్లులు వస్తాయి. ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే లబ్ధిదారుల అకౌంట్లో బిల్లులు చెల్లిస్తాం.



- వెంకటరత్నం, డ్వామా పీడీ, రాయచోటి.

గిరిజనుల సంక్షేమానికి చర్యలు : జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

ఆదివాసీల సంస్కృతి హక్కుల పరిరక్షణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి హక్కుల పరిరక్షణ అనే ఉద్దేశాలను ప్రజలందరూ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించేటప్పుడే ఆదివాసీల హక్కుల కోసం అధికరణ 46 అధికరణ 332 వంటి అధికరణలతో ఆదివాసీలకు హక్కులను కల్పించారన్నారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 5, 6లతో ఆదివాసీలకు స్వయం పరిపాలన దిశగా హక్కులను కల్పించారన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు సంబంధించిన పథకాలు హక్కులపై తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువుపై లారీ బోల్తా ఘటనలో క్షతగాత్రులకు ప్రభుత్వం, కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. జిల్లాలోని 12 గిరిజన సంక్షేమ పాఠశాలలు గిరిజన సంక్షేమ హాస్టల్లో వసతులు, విద్యపై మండల ప్రత్యేక అధికారులు తాసిల్దారుల దగ్గర నుండి నివేదికలు అందుతున్నాయని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆదివాసీల ఆధార్ కార్డు ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ ఇదివరకే అధికారులకు తగిన సూచనలు చేశారని తెలిపారు. ఆదివాసీల పథకాలకు సంబంధించిన సమస్యలు భూములకు సంబంధించిన సమస్యలపై జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజస్విని మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీల సంస్కృతి, వారి సంప్రదాయాన్ని గుర్తించడానికి 1994లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని గుర్తించిందన్నారు. ఆదివాసీలు పర్యావరణ పరిరక్షణకు, సేంద్రీయ వ్యవసాయానికి, అడవుల పరిరక్షణకు ఎంతో కృషి చేశారని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర సమరంలో బిర్సా ముండా, కొమరం భీం, వంటి గొప్ప నాయకులు స్వాతంత్ర ఉద్యమానికి పునాదులు వేశారన్నారు. జిల్లాలో గిరిజన హాస్టల్లో బాలల కంటే బాలికలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని గిరిజన పిల్లలందరూ వృద్ధిలోకి రావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు వంటి ఎంతోమంది నాయకులు గిరిజన హక్కుల కోసం పోరాడారని ఈ సందర్భంగా వారందరినీ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. గిరిజన పిల్లలందరూ చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వం ఎన్నో రకాల ఉపాధి కల్పన అవకాశాలు కల్పిస్తుందని, ముద్ర లోన్లు, పీఎం ఈజిపి, తదితర పథకాలను ఉపయోగించుకొని ఉపాధి పొందడమే కాకుండా ఉపాధి కల్పించాలని బాలబాలికలకు సూచించారు. ఈ వేడుకలలో డిఆర్ఒ మధుసూదనరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజస్విని, సిబ్బంది, రైల్వేకోడూరు జడ్‌పిటిసి రత్నమ్మ, గిరిజన నాయకులు, గిరిజన విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి ఆర్‌టిసి డిపో బస్సు కండక్టర్ ప్రసాద్ తన నిజాయితీని చాటుకున్నారు. రాయచోటి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు రాయచోటి నుంచి కడపకు వెళ్తుంది. రాయచోటిలో ఎక్కిన ఓ ప్రయాణికుడు తన విలువైన ల్యాప్ టాప్ బ్యాగుతో ప్రయాణిస్తున్నారు. తన గమ్యస్థానం రావడంతో ఆ బ్యాగును కూర్చున్న సీట్లో మర్చి పోయి బస్సు దిగిపోయారు. బస్సు కడపకు వెళ్లిన తర్వాత ఆ బస్సులో బ్యాగ్ ఉండ టాన్ని గమనించిన కండెక్టర్ దానిని పరిశీలించారు. అందులో ల్యాప్‌టాప్‌ఉన్నట్లు గుర్తించారు. తన బ్యాగ్‌ని మర్చిపోయినట్లు గ్రహించిన బాధితుడు రాయచోటి ఆర్‌టిసి డిపో వద్దకు చేరుకున్నారు. బ్యాగులో తన విలువ చేసే ల్యాప్‌టాప్‌ను ఉన్నాయని చెప్పారు. దానిని డిపో అధికారులు సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో ప్రయాణికుడికి అప్పగించారు. పోయిన బ్యాగ్‌ని తిరిగి అందజేసిన కండక్టర్ ప్రసాద్‌ను డిపో అధికారులు అభినందించారు. ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



యువకుడికి ల్యాప్‌టాప్‌ను ఇస్తున్న కండక్టర్

కిసాన్ ధన్ ఆరోగ్య యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి: కిసాన్ ధన్ ఆరోగ్య యోజన పాడి ఆరోగ్య పథకాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని కిసాన్ ధన్ ఆరోగ్య యోజన సిఇఒ వెంకటరమణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం పొందిన రైతులకు, కౌలు రైతులకు పలు రకాల ఆరోగ్య బీమా ప్రయోజనాలు, ధాన్య నష్ట పరిహారం, వ్యవసాయ పరికరాలపై రాయితీ, రుణ సౌకర్యం, పార్మింగ్ గుడ్డు ఉత్పత్తి, కోళ్ల పెంపకం, సేంద్రీయ వ్యవసాయ పొలాలు, పాల ఉత్పత్తి లాంటి మరెన్నో సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకుని ప్రయోజనాలు పొందాలని సూచించారు. రైతుల బిడ్డల నిరుద్యోగ యువతకు సంస్థలో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని మండలాలలో కిసాన్ ధన్ ఆరోగ్య యోజన లో పనిచేయుటకు మండల కో-ఆర్డినేటర్ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. వారికి మంచి జీతాలతో పాటు సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్నీ వివరాలు కొరకు 9063270906 సంప్రదించాలన్నారు.




మాట్లాడుతున్న వెంకటరమణ

తెలుగులో పిహెచ్‌డి పొందిన తొలి పరిశోధకుడు 'చిలుకూరి'

ప్రజాశక్తి-కడప అర్బన్ : తెలుగులో పిహెచ్‌డి పట్టా పొందిన తొలి పరిశోధకుడు డాక్టర్ చిలుకూరి నారాయణరావు అని, ఆయన మద్రాసు విశ్వవి ద్యాలయం ద్వారా ఆ పట్టాను సాధించారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శనివారం ప్రసిద్ధ భాషావేత్త డాక్టర్ చిలుకూరి నారాయణరావు 137వ జయంతిని నిర్వహించింది. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు, సిబ్బంది కలసి చిలుకూరి నారాయణరావు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో 'దత్తమండలాలు'గా ఉన్న ప్రాంతానికి 'రాయలసీమ' అనే నామకరణం చేసిన మేధావి చిలుకూరి అని పేర్కొన్నారు. ఆయన 1.50 లక్షల తెలుగు సామెతలను సేకరించడం విశేషమన్నారు. ఆయనకు తెలుగుతోపాటు మరాఠీ, జపనీస్, ఉర్దూ లాంటి పలు భాషల్లో ప్రావీణ్యం ఉందన్నారు. సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష? శాస్త్రి మాట్లా డుతూ నారాయణరావు దాదాపు 240 పుస్తకాలను రచించారని, కానీ దురదృష్టవశాత్తు చాలా పుస్తకాలు అముద్రితాలుగానే మిగిలిపో యాయని పేర్కొన్నారు. ఆయన గొప్ప నాటకకర్త అని, అంబ, అశ్వత్థామ, పెళ్ళి మొదల్కైన నాటకాలు రచించారన్నారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఆంధ్రవిశ్వవిద్యాలయం వారు 'కళాప్రపూర్ణ' బిరుదుతో, కాశీ సంస్కృత విద్యాపీఠంవారు 'మహామహోపాధ్యాయ' బిరుదుతో సత్కరించారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాటాడుతూ ఖురాన్‌ను తెలుగులోకి అనువదించిన తొలివ్యక్తి చిలుకూరివారన్నారు. ఆయన జపాన్-తెలుగు పదకోశం, తెలుగు - జపాన్ పదకోశం, మరాఠీ-తెలుగు పదకోశం, ఆంధ్రాంగ్ల నిఘంటువు, నన్నయ భారత నిఘంటువు వంటి అనేక భాషా గ్రంథాలను రచించారన్నారు. గడియారం వెంకటశేషశాస్త్రి రచించిన శివాజీ చరిత్రకు 'శివభారతం' అనే పేరుపెట్టింది చిలుకూరివారేనని అన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు మాట్లాడుతూ చిలుకూరివారు నిరంతర అధ్యయనశీలి అని, చిన్ననాటి నుంచే ఏకసంథాగ్రహిగా ఉండేవారని, గిడుగు రామ్మూర్తి పంతులు శిష్యుడని అన్నారు. మరో గ్రంథాలయ సహా యకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ చిలుకూరి నారాయణరావు మహోన్నత వ్యక్తిత్వాన్ని కొనియాడారు. దుర్భాక రాజశేఖర శతావధానికి స్వర్ణ కిరీట సత్కారాన్ని, గడియారం వెంకటశేషశాస్త్రికి గండపెండేర సత్కారాన్ని జరిపించడంలో చిలుకూరివారే ప్రధాన పాత్ర పోషించారని పేర్కొన్నారు.

ప్రలోభాలకు వేళాయే!

- యథేచ్ఛగా నగదు పంపిణీ
- ఓటుకు రూ.2 వేలు
- నేటితో ప్రచారానికి తెర



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రలోభాలకు తెరలేచింది. ఎన్నిక ఏదైనా సరే ఓటుకు నోటు పంపిణీ చేయడం పరిపాటిగా మారింది. ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నాలుగు రోజుల ముందే శ్రీకారం చుట్టారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా ఓట్లు వేయించుకోవాలి. ప్రస్తుతం అటువంటి ఆదర్శానికి విరుద్ధంగా ఓటుకు నోటు పంపిణీలో వైసిపి, టిడిపి అభ్యర్థులు మునిగి తేలుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలో ఎవరికీ ఎవరూ తీసిపోకుండా నువ్వానేనా అనే రీతిలో పోటీలు పడి డబ్బులు పంపిణీ చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. నేటితో ఉప ఎన్నికల ప్రచారానికి తెరపడనున్న నేపథ్యంలో తెరవెనుక మంత్రాంగం జోరందు కుంది. ఈ నెల 12న ఉప ఎన్నికల ఓటింగ్ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఓటరుకు పెద్దఎత్తున నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు.

జిల్లాలోని జడ్‌పిటిసి ఉప ఎన్నికలో ఓటుకు నోటు యథేచ్ఛగా సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాలోని పులివెందుల, రాజంపేట అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పులివెందుల, ఒంటిమిట్ట స్థానాల్లో ఉపఎన్నిక జరుగుతోంది. పులివెందుల పరిధిలో 10,600 ఓటర్లు, ఒంటిమిట్ట పరిధిలో 26,800 వరకు ఓటర్లు ఉన్నారు. వీటి పరిధిలోని 80 శాతం ఓటర్లకు నగదు పంపిణీ చేయడానికి ఆయా రాజకీయ పార్టీల కార్యకర్తలు బృందాలుగా విడిపోయి నగదు పంపిణీ వ్యవహారాన్ని పకడ్బందీగా చేపడుతున్నారు. ఉభయ జిల్లాలోని పలువురు నాయకులు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు తమ వంతు భారీగా విరాళాలను సమకూర్చినట్లు ప్రచారంలో ఉంది.

పోలింగ్ బూత్‌ల వారీగా...

కడప జిల్లాలోని పులివెందులలో 15, అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట మండలాల్లో 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు నగదు పంపిణీని వేగవంతం చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి మంగళవారం వరకు నగదు పంపిణీ చేపట్టనున్నారు. శుక్రవారం వైసిపి ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు, గంగపేరూరు, నరవకాటిపల్లి ప్రాంతాలు, టిడిపి సాలాబాద్, రాచపల్లి ప్రాంతాల నుంచి నగదు పంపిణీకి శ్రీకారం చుట్టింది.

ఓటుకు రూ.2 వేలు

ఒంటిమిట్ట జడ్‌పిటిసి పరిధిలోని ఓటుకు రూ.రెండు వేల చొప్పున నగదు పంపిణీ యథేచ్ఛగా సాగిపోతోంది. పులివెందుల పరిధిలో పెద్దఎత్తున నగదు పంపిణీ చేయడానికి కసరత్తు జరుగుతోంది. పులివెందుల పరిధిలో నలపురెడ్డిపల్లి, యర్రబల్లి, ఇ.కొత్తపల్లి, నల్గొండువారిపల్లి, కణంపల్లి, రాగిమానుపల్లి, అచ్చిగల్లి, ఎర్రిపల్లి పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 12 గ్రామాల్లో పెద్దఎత్తున నగదు పంపిణీకి కసరత్తు జరుగుతోంది. ఒంటిమిట్ట మండల పరిధిలోని 13 పంచాయతీల పరిధిలోని 26 గ్రామాల్లో రాజకీయ పార్టీల కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి నగదు పంపిణీ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. వైసిపి నాయకత్వం నగదు ఎన్నికల ప్రచారం మొదలు, నగదు పంపిణీ అంశాల్లో వ్యూహాత్మకంగా ముందంజలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒంటిమిట్ట మండల టిడిపి నాయకుల్లో గ్రూపు విభేదాలు, నగదు పంపిణీ వ్యవహారంలో వెనుకబాటుతనం కనిపిస్తోంది. ఏదేమైనప్పటికీ ప్రలోభాలకు తెరలేచిన నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి ఎనలేని హాని తలపెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

పులివెందులపై జగన్‌ది కపట ప్రేమ

- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల ప్రాంత ప్రజలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కపటి ప్రేమ తప్ప ప్రేమ లేదని, అభివృద్ధి చేయకుండా మోసం చేశారని, తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని గృహ నిర్మాణ, ఐఅండ్‌పిఆర్ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, అనంతపురం జిల్లా టిడిపి నాయకులు సాంబశివుడుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ బయట ప్రాంతం వారు పులివెందుల ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ ఉండదని అనుకోవడం జరుగుతుందని తెలిపారు. నేను వచ్చి ఇక్కడ స్థానిక నాయకులతో పలు గ్రామాల్లో పర్యటించిన ప్రతిచోట తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని, ఎక్కడ చూసినా ప్రజలు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. ఉప ఎన్నికలలో మారెడ్డి లత తప్పక విజయం సాధిస్తుందన్నారు. జగన్ తన సొంత నియోజకవర్గంలోని ప్రజలకు కూడా న్యాయం చేయలేకపోయారని, ఇక్కడ కనీస అవసరాలు కూడా తీర్చకుండా కాలయాపన చేస్తూ కేవలం బటన్లు నొక్కడానికి పరిమితమయ్యాడే తప్ప ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయలేదని విమర్శించారు. వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన వారి పొలాల వద్ద రోడ్లకు అడ్డంగా గోడలు కట్టడం, పొలాల్లోకి వెళ్లకుండా అడ్డగించడం, అప్పులు చెల్లించాలని బలవంతం చేయడం ఇలా అనేక రకమైన కారణాలతో ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు కలిగించినా ప్రజలు ఒకసారి ఓటు వేయాలని నిర్ణయించుకుంటే వారిని ఎవరూ ఆపలేరని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలన్నీ దరిదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం ఎప్పుడు ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. అరటిపండు నిల్వ ఉంచే కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసి, పనులు పూర్తి చేయలేదన్నారు.

వాళ్లకు వాళ్లే దాడి చేసుకుని మాపై నిందలా? : బీటెక్ రవి

జడ్‌పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా వైసిపి నేతలు వాళ్లకు వాళ్లే దాడి చేసుకుని మాపై నింద వేయడానికి ప్లాన్ చేస్తున్నారని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి విమర్శించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థులుగా వైసిపి వ్యక్తులే నామినేషన్ వేశారని చెప్పారు. ఆ పార్టీ వారు కుట్రలు చేస్తూ మాపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల రోజు ఏం జరిగినా తనకు సంబంధం లేదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, చిత్రంలో మంత్రి సవిత

టిడిపి కంచుకోట కాబోతోంది : ఎంపీ శబరి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంత అడ్డా పులివెందుల తెలుగుదేశం పార్టీకి కంచుకోట కాబోతోందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం పులివెందులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిడిపి కుటుంబ సభ్యులంతా జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో కలిసి పాల్గొంటున్నారని తెలిపారు. కడప, పులివెందులకు ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తికి రూ.1,500 కోట్లు ఇచ్చిందని చెప్పారు. ఆ డబ్బును దారి మళ్ళించారని ఆరోపించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో దోచుకోవడంతోనే సరిపోయిందన్నారు. వైసిపి నాయకులు ఎన్ని కుట్రలు చేసిన ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగితే వైసిపి గెలవదు : ప్రత్తిపాటి

ఒంటిమిట్ట : జడ్‌పిటిసి ఉప ఎన్నికలు సజావుగా జరిగితే పులివెందులలో వైసిపి గెలవదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ నెల 12న జరగనున్న ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో గతంలో ఎప్పుడూ స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రౌడీ మూకలను తరమికొట్టేందుకు పులివెందుల ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధిలో దేశానికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోల్‌మోడల్ అని, సూపర్-6 పథకాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు.

ఐఎన్‌టిఎస్ఒ ఫలితాల్లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఒ జాతీయ స్థాయి ఫలితాల్లో అనూహ్యఫలితాలు సాధించి వివిధ విభాగాల్లో బహుమతులు పొందారని కడప డివిజన్ ఎజియండి రమణయ్య అన్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూల్, కడప రోడ్డులోని సమావేశ మంది రంలో ఏర్పాటుచేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీపరీక్షలు ఏవైనప్పటికీ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాల పరంపర కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవెల్ టీచింగ్ తోబాటు అంకిత భావంతో పనిచేసే అనుభ వజ్ఞులైన అధ్యాపక బృందం ముఖ్య కారణమని అన్నారు. అనంతరం విజేతలకు ల్యాప్ టాప్‌లు ట్యాబ్‌లు, నగదు బహుమతులతో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కళాభారతి, శివార్జున రెడ్డి, నరేంద్ర, బివి ప్రసన్నకుమారి, రాధిక, వైస్ ప్రిన్సిపల్ జీవానందం, సెలీన, ఎ.ఒ వెంకట్రాజు, రామనాధ్, రవి, ధన, రెడ్డి శేఖర్, డీన్‌లు అల్లాబక్ను,సురేష్, ప్రసాద్, శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్‌చార్జిలు నాగ ప్రియ, నస్రీన్ బాను, శశికళ, ప్రమీల,రేష్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎటిఎం

దారుణం

ప్రజాదృష్టి

జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో హింస చెలరేగడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల తరుపున ప్రచారం చేయడం సహజం. జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల పులివెందుల ఘటనలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడికి పాల్పడడం ఆందోళన కలిగించింది. అంతకుముందు ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్న నలుగురు వైసిపి నాయకులపై దాడి చేసిన ఘటనల్ని పరిశీలిస్తే పోలీసుల భద్రతా వైఫల్యం కనిపించింది. ఫ్యాక్షన్ మూలాలను కలిగి ఉన్న గ్రామాల్లో ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎస్పీ, కర్నూలు రేంజ్ డిఐజితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించడం, ప్రచారాల నిర్వహణపై సీరియస్‌గా దృష్టి సారించడంతో పరిస్థితి అదుపులోకి రావడం ఉపశమనాన్ని కలిగించింది. ఉప ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో చిన్నపాటి ఘర్షణ ఫ్యాక్షన్ తరహా ఉద్రిక్తతలకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నికలకు రాజకీయ పార్టీలు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వడమే ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె ఎన్.సునీత దంపతులు ఎస్‌పిని కలవడం, తాజాగా జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న దాడులు..ప్రతిదాడుల వాతావరణాన్ని వైఎస్ వివేకా హత్య వాతావరణంతో పోల్చడం అందరి దృష్టినీ ఆకర్షిం చింది. తాజాగా అన్నదాతా సుఖీభవ పథకం లబ్ధిదారులందరి ఖా తాల్లో నిధులు జమ చేయకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. గత సర్కారు హయాంలోని లబ్ధిదారుల ఆధారంగా నిధులు జమ చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణం. వారికి అర్హత సాధి ంచిన రైతులు, ఇప్పుడెందుకు అర్హత సాధించలేదో పాలకులే వివరి ంచాలి. ఒకవేళ రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడానికి గల కారణాలేమిటి, తప్పిదాలను సరిదిద్దాల్సిన బాధ్యత జిల్లాలోని రెవెన్యూ ఉన్నతాధికారులైన కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్లకు కట్టబెట్టాలి. లేనిపక్షంలో తహశీల్దార్ చిన్నపాటి తప్పిదందొర్లితే చాలు ఉద్దేశపూర్వకంగా నిలుపుదల చేసి, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా చేయ డానికి యథాశక్తి కృషి చేస్తారనడంలో సందేహం లేదు. ఇప్ప టికైనా రాష్ట్రప్రభుత్వం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించి, వైసిపి సర్కారు హయాం తరహాలో లబ్ధిదారులందరికీ అన్నదాతా సుఖీభవ పథకం వర్తించేలా చూడాల్సి ఉంది. వైసిపి హయాంలోని సంక్షేమాన్ని, కూటమి సర్కారు హయాంలోని సంక్షేమాన్ని పోల్చి చూసుకుంటున్న రోజుల్లో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


నులిపురుగుల నివారణపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

నులిపురుగుల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-కలకడ

నులిపురుగుల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ మల్లికార్జున తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాలలలో పంపిణీ చేసే నిమిత్తం కలకడ, ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మాత్రలు పాఠశాలలను విద్యార్థులకు మింగిచడం వల్ల వారి కడుపులో ఉన్న నులిపు రుగులు మృతి చెంది పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఆల్బెండజోల్ మాత్రలపై అవగాహన కల్పించాలని సూచించామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరామిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, హెల్త్ సూపర్వైజర్ నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ హాజీర, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.

బి.కొత్తకోట సిఐగా గోపాల్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట


బాధ్యతలు స్వీకరిస్తున్న గోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ న్యూసిఐగా బి.గోపాల్ రెడ్డి నియమితుల య్యారు. శనివారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న జి.జీవన్‌గంగానాథ్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రెగ్యులర్ సిఐగా బి.గోపాల్ రెడ్డిను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శాంతి భద్రతల పరిరక్ష ణకు అధిక ప్రాధాన్యత నిస్తామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ ప్రాంతం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండటంవల్ల ప్రత్యేక నిఘా ఉంచు తామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు, మాట్కా, పేకాట, అసాంఘిక కార్యకలాపాపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశా రు. సిఐగా బాధ్యతలు చేపట్టిన బి.గోపాల్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రాఖీపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి- కలకడ


రాఖీపౌర్ణమి వేడుకల్లో అన్నాచెల్లెలు

సోదరి సోదరుల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగను జరుపుకుంటారు. మండలంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను వైభవంగా నిర్వహించుకు న్నారు. అన్న చెల్లెల అనుబంధానికి మార ుపేరుగా నిర్వహించుకునే ఈ రక్షాబంధన్ వేడుకలను గ్రామీణ ప్రాంతాలలో సైతం నిర్వహించుకోవడం విశేషం. అన్నలకు చెల్లెల్లు, చెల్లెళ్లకు అన్నలు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందడం జరిగింది. ఈ వేడుకలను సంతోషంగా నిర్వహించుకుని రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **మదనపల్లె అర్బన్ :** చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ప్రతి బిడ్డ సోదర భావంతో మెలగాలని, ఒకరినొకరు సహాయపడుతూ ఆడపిల్లలకు మగ పిల్లలు రక్షణ కల్పించాలని నిర్వాహకులు ఎంపీ ఆనందన్ పిలుపునిచ్చారు. నీకు నేను రక్ష, నాకు నువ్వు రక్ష అనే నినాదంతో రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఉపాధ్యాయులు సిబ్బంది పిల్లలు పాల్గొన్నారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందాం

ప్రజాశక్తి-రామాపురం

అన్నమయ్య జిల్లాను 2027నాటికి మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ సచివాలయ పరిధిలోని దోమల నివారణ స్ప్రేయింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రతి ఇంటిలో దోమల నివారణకు స్ప్రేయింగ్ తప్పనిసరి చేయించుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు నీరు నిల్వ చేసుకోకుండా ఎప్పటికప్పుడు శుభ్ర పరచుకోవాలన్నారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటించి దోమల వృద్ధి కాకుండా చేసుకోవాలన్నారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను నివారించవచ్చని అన్నారు. దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఒకరు తప్పక దోమ తెరను వాడాలని, ఇంటిలోకి కిటికీలకు మెస్ కొట్టించుకోవాలన్నారు. గ్రామాలలో సాయంత్రం వేళల్లో వేపాకుతో పొగ పెట్టడం వల్ల దోమలను నివారించుకోవచ్చు అన్నారు. స్ప్రే నిర్వహణను స్టేట్ కాన్సలేట్ కన్సలెంట్ కొండారెడ్డి విజయవాడ నుండి వీడియో కాల్ ద్వారా పర్యవేక్షించి సాంకేతిక సలహాలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ క్రిస్టఫర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

వెండి అభిషేకం చెంబు, త్రిశూలం వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని మల్లయ్య కొండపై ఉన్న శ్రీ పరమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు వెండి అభిషేకం చెంబు త్రిశూలం వితరణగా అందించారు. పెద్దతిప్ప సముద్రం మండలం రంగసముద్రానికి చెందిన శ్రీనివాసచారి, నాగరత్నమ్మ దంపతులు కుటుంబ సభ్యులు రూ.15వేలు విలువ చేసే 149 గ్రాముల అభిషేకం వెండి చెంబు, రూ.1500 విలువచేసే ఇత్తడి త్రిశూలం వితరణగా అందించారు. వారి దాతృత్వాని ఇఒ మునిరాజా, కొండకిట్ట పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు అభినందించారు.

అన్నదాన సేవా ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం సమీపంలోని శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్ట్ అన్నదానముకు శాశ్వత చందా రూ.లక్ష నూటపదహారు రూపాయలను రాజంపేటకు చెందిన ఉపాధ్యాయుడు శిల్పి ఆనంద్‌ఆచారి, రాజేశ్వరి దంపతులు కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు శనివారం నాడు అందించారు. ఈ సందర్భంగా సౌమ్యనాథ సేవా ట్రస్ట్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు మాట్లాడుతూ త్వరలో శుక్ర, శని, ఆది వారం మూడు రోజులు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం దాత శిల్పి ఆనందాచారి, రాజేశ్వరి దంపతులను శాలువతో సన్మానించారు. చక్రాల రామసుబ్బన్న మాట్లాడుతూ అన్నదాన ట్రస్టు నిర్వహణకు దాతల సహకారం మరువ లేనిదని కొనియాడారు.

అన్న క్యాంటీన్‌లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భోజనం చేయడానికి వచ్చిన వారిని భోజనం బాగుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి, పరిశుభ్రత ఎలా ఉందో ఆరా తీశాయి. అనంతరం అన్న క్యాంటీన్‌లోనే భోజనం చేశారు. అనంతరం ఆయన క్యాంటీన్‌ను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..!

- షాదీ మహల్ దగ్గర పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట


గుంతలమయమైన రోడ్డులో ఇబ్బందులు పడుతున్న ద్విచక్రవాహనదారులు

పట్టణంలోని పెద్దతిప్పసముద్రం రోడ్డులోని షాదీమహల్ దగ్గర సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ద్విచక్ర వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా పూర్తిగా గుంతల మయంగా మారింది. మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు బారిన పడ్డారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్డు మరింత దెబ్బతిన్నాయి. ఆర్అండ్‌బి అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయిస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు వేయలేదని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పలురోడ్లు దెబ్బతిన్నాయని విన్నవించుకుంటున్నా కనీసం మరమ్మతులను కూటమి ప్రభుత్వం చేపట్టిలేదని పలువురు ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని రంగసముద్రం రోడ్డులోని ప్రభుత్వ పశువులు ఆసుపత్రికి సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ విషయంపై ఆర్ అండ్ బి నియోజవర్గం వర్క్ ఇన్స్‌పెక్టర్ రెడ్డెప్పని వివరణ కోరగా ఈ రెండు రోడ్లు మరికొన్ని గుర్తించి రోడ్లు నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని కనీసం మరమ్మతులు చేయడానికి అను మతులు రావాలని అన్నారు. వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం : టిడిపి


కరపత్రాలను చూపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమని, గత వైసిపి పాలనలో రాష్ట్రం ధ్వంసం అయిందని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె. వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని ఎగువమాచిరెడ్డిగారిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని, వైసిపి కార్యకర్తలు సైతం ప్రభుత్వ పథకాలు మాకూ అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై పనికట్టుకొని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, ఏదో రకంగా బురద చల్లాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈనెల 15 నుంచి మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు సిఎం చంద్రబాబు ఇదివరకే ఆదేశాలు కూడా జారీ చేశారని తెలిపారు. రాష్ట్రంలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఎంతో సౌకర్యముతో ఎసి ఎలక్ట్రానిక్ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఇకపై ఎసి ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే సూపర్ సిక్స్ పథకాలలోని దీపం పథకం, నిరుద్యోగులకు మెగా డిఎస్‌సి తల్లికి వందనం, రైతులకు పిఎం కిసాన్ -అన్నదాత సుఖీభవ ద్వారా రూ.7వేలు అందించామన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఆగస్టు 15 నుంచి ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అందిస్తున్నాదని పేర్కొ న్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసి ఖజానాను దుర్వినియోగం చేశారన్నారు. మద్యం విక్రయల ద్వారా రాష్ట్రనికి రావలసిన ఆదాయాన్ని వైసిపి నాయకులు తమ జేబులోకి వేసుకున్నారని తెలిపారు. పార్టలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సిద్ధంగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మల్లికార్జున, శంకర, చెన్నం రాజశేఖర్, వంశీ, వెంకటరమణ, రవి, శివకృష్ణ, యువరాజ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

వెంకట సాయి ఆస్పత్రి నూతన భవనం ప్రారంభోత్సవంలో వైద్యులు


వెంకటసాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి.. డాక్టర్ లోకవర్ధన్ దంపతులు

ప్రజాశక్తి-కలికిరి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. శనివారం నూతనంగా నిర్మించిన వెంకటసాయి ఎమర్జెన్సీ ఫీవర్, మల్టీ స్పెషాలిటీ ఆస ్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకు స్థానిక టిబి రోడ్డులోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో గత 20 సంవత్స రాలుగా ప్రజలకు వైద్య సేవలు అందించామని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిని ఆర్ఎన్ ఆర్ థియేటర్ ప్రక్కన నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చామని తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్విమ్స్ వైద్యులు

స్థానిక పట్టణంలోని జవహర్ నవోదయ పాఠశాలలో స్విమ్స్ వైద్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్విమ్స్ నుంచి వచ్చిన వివిధ విభాగాల డాక్టర్లు విద్యార్థులకు, విద్యాలయం సిబ్బందికి, స్థానిక ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ముఖ్యంగా కళ్లు, యూరాలజీ, గైనకాలజీ, ఇఎన్‌టి, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల్లో వైద్యులు పిల్లల్ని ప్రత్యేకంగా పరిశీలించారు. అవసరమైన వారికి తదనంతర పరీక్షల కోసం తిరుపతిలోని స్విమ్స్ కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గీతా మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులకు దృష్టి లోపాలను గుర్తించి చికిత్స అందించడం జరిగిందన్నారు. అమ్మాయిలు తమకు ఉన్న సందేహాలను, సమస్యలను గైనకాలజీ డాక్టర్లను సంప్రదించి నివృత్తి చేసుకున్నారన్నారు. పింక్ బస్ ద్వారా కేన్సర్ నిర్ధారిత పరీక్షలు చేశారు. లోతైన పరీక్షలకు సిఫార్స్ చేసిన వారు తిరుపతి లోని స్విమ్స్ కు రావాలని విభాగపతులు తెలిపారు. ఈ క్యాంపులో 242 మంది ఆర్థోపెడిక్ సేవలను, 248 మంది డెర్మటాలజీ సేవలను, 299 మంది జనరల్ ఫిజిషియన్ సేవలను, 60 మంది పింక్ బస్ సేవలను వినియోగించున్నారని తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రామాపురం : రాయచోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డు రాజు మెయిన్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించేఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పిఎస్ హరినాథ్‌రెడ్డి, రీజనల్ చైర్మన్ షేక్ మొహమ్మద్, క్యాంప్ ఆర్గనైజర్, రాయచోటి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుపులేటి శ్యామ్ పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి నిర్వహిస్తారని తెలిపారు. చుట్టుపక్కల మండలాల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి డాక్టర్లు శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తారు. కంటికి శస్త్ర చికిత్స కు ఎంపిక అయిన వారిని తిరుపతి ఆసుపత్రికి తీసుకు వెళ్లి భోజనం వసతుల ఏర్పాటు చేసి ఆపరేషన్ అనంతరం రెండు రోజులు తరువాత వారిని శిబిరం వదులుతారు అన్నారు. హ్రస్వదృష్టి, దూరదృష్టి లోపం ఉన్నవారిని పరీక్షించి మందులతో పాటు కంటి అద్దాలను అందిస్తారని తెలిపారు. షుగర్, బిపి ఉన్నవారు డాక్టర్ వద్ద పరీక్షలు నిర్వహించుకొని సర్టిఫికెట్ తీసుకురావాలని ఎలతిపారు. కంటి అద్దాలు అవసరం ఉన్నవారికి శిబిరం వద్దనే కంటి అద్దాలు సరసమైన ధరకు అందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించాలని వారు కోరారు.



మాట్లాడుతున్న శ్రీనివాస వర్మ

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-పీలేరు

గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకుంటూ హక్కుల సాధన కోసం ఐకమత్యంగా పోరాటాలు సాగించడమే సరైన మార్గమని గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఎపి గిరిజన యానాది సేవా సంఘం, ఎపిఆదివాసి ఎరుకల సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పీలేరులో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా వేష, భూషణలతో విద్యార్థులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం అనేది మన గిరిజనుల చరిత్ర, సంప్రదాయాలను గుర్తు చేసే రోజని తెలిపారు. మన పూర్వీకులు అడవులు, నదులు, పర్వతాలతో మమేకమై జీవనం సాగించారని, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతలో గిరిజనుల పాత్ర అపారమైందని గుర్తు చేశారు. కాలక్రమేణ మనం మన భూములు, వనరులు, జీవనాధారం కోల్పోతున్నామన్న ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం మనకు హామీ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని, భూహక్కు, అటవీ హక్కులతోపాటు విద్యా అవకాశాలు, వైద్య సదుపాయాలన్నీ బలపరచాలని డిమాండ్ చేశారు. యువత విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. మన భాష, మన సంస్కృతి, సాంప్రదాయ పండుగలను కాపాడుకోవాలని కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని సెలవుదినంగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు, కార్యనిర్వాహక అధ్యక్షులు గడ్డం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి, ఏపి ఆదివాసి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస వర్మ, జిల్లా నాయకుడు కిల్లా విజయ్ కుమార్, యానాది మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సావిత్రమ్మ, గిరిజన నాయకులు క్రాంతి కుమార్, నారాయణమ్మ, టేకుమంద రెడ్డప్ప, చుక్కలపాటి ఆదినారాయణ, కంబాల ఈశ్వరయ్య, మర్రిపాటి లోకేష్, పెద్దబ్బ, కుప్పం రాజేష్, తుపాకుల చంద్రయ్య, గిరిజన గురుకుల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రదీప్, ఎఎన్ఎం అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

భావోద్వేగ మేధస్సును అభివృద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యార్థులు భావోద్వేగ మేధస్సును అభివృద్ధి చేసుకోవాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ చాముండేశ్వరి పేర్కొన్నారు. అంగళ్లు సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం మహిళా ఎంపావర్‌మెంట్ సెల్‌తో కలిసి, నర్చరింగ్ మైండ్స్, ఎంపావరింగ్ ఫ్యూచర్స్ అనే అంశం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్‌ఈ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, రిసోర్సు పర్సన్‌గా ప్రముఖ సైకాలజిస్ట్, స్టూడెంట్ కౌన్సెలర్ డాక్టర్ అన్నమరెడ్డి చాముం డేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడి నిర్వహణ, తోటివారి ప్రభావం మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం ఆచరణాత్మక వ్యూహా లపై అవగాహన కల్పించారు. భావోద్వేగ శ్రేయస్సు, వ్యక్తిగత పరిశుభ్రత, డిజిటల్ క్రమశిక్షణ, భావోద్వేగ స్థితిస్థాపకత పై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.


మృతి చెందిన గొర్రెలను చూపుతున్న బాధితులు

పిడుగుపాటుకు 42 గొర్రెలు మృతి

- పరామర్శించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి
- 50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని ఆర్ఎన్ తాండ గ్రామం బొనాసివారిపల్లికి చెందిన మావిల రెడ్డమ్మకు చెందిన 42 గొర్రెలు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పాటుకు గురై మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి శనివారం స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామానికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.50వేలు అంద చేశారు. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నష్టపరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-చిన్నమండెం :మండలంలోని కేశపురం గ్రామం, గుట్టమూల ఆంజనేయస్వామి తిరుణాల సందర్భంగా శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి, కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుణాలకు వచ్చిన భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలోటిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా బిసి సెల్ కార్యదర్శిగా ద్వారకనాథ్ నాయుడు

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

కంభంవారిపల్లి మండలం పాలెంగడ్డ పంచాయతీకి చెందిన ద్వారకనాథ్ నాయుడు వైసిపి జిల్లా బిసి సెల్ కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైసిపి బిసి సెల్ కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారం మరువలేనిదని అన్నారు. నా మీద నమ్మకంతో జిల్లా బిసి సెల్ పదవి అప్పగించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పదవి నిర్వహిస్తానని, పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా కృషి చేస్తానని తెలిపారు. బిసి వర్గాల అభివృద్ధికి ముందు వరుసలో ఉంటానని తెలిపారు.


ద్వారకనాథ్ నాయుడును సన్మానిస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

క్రైం కార్నర్

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బస్సు కింద పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటనలో ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. నిమ్మనపల్లిలోని విజయవాణి ప్రయివేటు పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్షానికి మూడు ఏళ్ల చిన్నారి ఇడగొట్టి దివాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. పాఠశాల యాజమాన్యం నిర్లక్షానికి అద్దం పడుతూ పాఠశాల బస్సుకు క్లీనర్‌ను ఏర్పాటు చేయకపోవడమే ప్రధాన కారణంగా నర్సరీ విద్యార్థి మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు పై పాంశాల కరస్పాండెంట్ రఘుపతి నాయుడు, ప్రిన్సిపల్ శ్రీనివాసులు నాయుడు, డ్రైవర్ గురుప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పుంగనూరుకు చెందిన కృష్ణప్ప కుమారుడు నాగరాజు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. సిటియం సమీపంలోని గుడిసివారిపల్లె లోని ఓ ఇంటికి పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళ్ళాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా బైపాస్‌రోడ్‌లో అటుగా వచ్చిన పాలవ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితున్ని అదే పాలవ్యానులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు..సిటియం గ్రామం, మిట్టపల్లికు చెందిన గోపాల్ రెడ్డి కుమారుడు రవి కుటుంబ సమస్యలపై ఇంట్లో గొడవపడ్డాడు. తీవ్ర మనస్థాపానికి గురైన అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసు కుంది. మండల కేంద్రం మొలకలచెరువు ఇందిరా కాలనీ చెందిన వెంకటరమణ నాయక్ భార్య శాంతమ్మ (45) అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం కుమారుడుతో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లికు ఆసుపత్రికి వెళ్లారు. మదనపల్లిలో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా వేపురికోట సమీపంలో ద్విచక్ర వాహనంలో శాంతమ్మ చీర చిక్కుకుని గాయపడింది. వెంటనే మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిస్థితి విషమించడంతో తిరుపతికి రిఫర్ చేశారు. తిరుపతిలో చికిత్స పొందుతూ శాంతమ్మ మృతి చెందారు. మృతి చెందిన శాంతమ్మకు భర్త తో పాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలం పరిధిలోని పడమటి కోన గ్రామంలోని తోగ టపల్లి వద్ద శనివారం సాయంత్రం ట్రాక్టర్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతులు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వారని, విద్యుత్ స్తంభాలు నాటే పనిచేసేందుకు ఇక్కడకు వచ్చినట్లు స్థానిక ప్రజలు పేర్కొన్నారు. మృతులను పోస్టుమార్టం నిమిత్తం 108వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతు వివరాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.